నల్లగొండలో కౌంటింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

కాంగ్రెస్ విజయం

- నల్లగొండలో రఘువీర్‌రెడ్డికి రికార్డు మెజార్టీ
- 5,59,905 ఓట్లతో ఘన విజయం
- భువనగిరిలో చామలకు భారీ మెజార్టీ
- 2,22,170 మెజార్టీతో విజయం
- సంబురాల్లో కాంగ్రెస్ శ్రేణులు

నల్లగొండ ప్రతినిధి, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : 2019 లోక్‌సభ ఎన్నికల మాదిరిగానే ఈ సారి కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలనూ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. నల్లగొండలో కుందూరు రఘువీర్‌రెడ్డి, భువనగిరిలో చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించారు. గతంతో పోలిస్తే ఈ సారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీగా ఓట్లు సాధించారు. నల్లగొండలో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి 5,59,905 ఓట్ల రికార్డు మెజార్టీతో గెలుపొందారు. భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి 2,22,170 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. రెండు స్థానాల్లో భారీ విజయాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాల్లో మునిగిపోయాయి. అసెంబ్లీ స్థానాల వారీగా చూసినా అన్ని చోట్లా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించారు. అభ్యర్థుల విజయానంతరం కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి గెలుపు ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు.

నల్లగొండలో రిటర్నింగ్ అధికారి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న రఘువీర్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, జైవీర్‌రెడ్డి

భువనగిరిలో రిటర్నింగ్ అధికారి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి,

నల్లగొండలో రికార్డు విజయం

నల్లగొండ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ రికార్డు విజయం సాధించింది. ఆ పార్టీ నుంచి పోటీ చేసిన కందూరు రఘువీర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిపై 5,59,905 ఓట్ల ఆధిక్యంతో భారీ విజయం సాధించారు. మొత్తం పోస్టల్ బ్యాలెట్లతో కలిపి 12,96,324 ఓట్లు పోలవగా.. అందులో కాంగ్రెస్ అభ్యర్థికి 7,84,337 ఓట్లు లభించాయి. రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డికి 2,24,432 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి 2,18,417 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. మొత్తం 24 రౌండ్లలో ఈవీఎం ఫలితాలు, మరో రౌండ్‌లో పోస్టల్ బ్యాలెట్ల ఫలితాలను వెల్లడించారు. అన్ని రౌండ్లలోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్పష్టమైన ఆధిక్యతతో ముందుకు దూసుకెళ్లారు. దీంతో రఘువీర్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేనంతటి మెజార్టీతో ఘన విజయం సాధించి కొత్త రికార్డు సృష్టించారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీకి 50వేలకు తగ్గకుండా మెజార్టీ లభించింది. అత్యధికంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో 1,05,419 ఓట్ల మెజార్టీ రాగా.. అత్యల్పంగా మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నియోజకవర్గమైన నల్లగొండలో 53,179 ఓట్ల మెజార్టీ లభించింది. మొత్తం పోలైన ఓట్లలో రఘువీర్‌రెడ్డి 60.50శాతం ఓట్లు సాధించగా.. బీజేపీకి 17.31 శాతం, బీఆర్‌ఎస్‌కు 16.85 శాతం ఓట్లు వచ్చాయి. విజయానంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యేలు బాలూనాయక్, జయవీర్‌రెడ్డి తదితరుల సమక్షంలో రఘువీర్‌రెడ్డి రిటర్నింగ్ అధికారి హరిచందన నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వెలుపల కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచా కాలుస్తూ విజయోత్సవ సంబురాలు జరుపుకొన్నాయి.

భువనగిరిలో 2,22,170 ఓట్ల మెజార్టీ..

భువనగిరి లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి 2,22,170 ఓట్ల మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌పై ఘన విజయం సాధించారు. ఇక్కడ పోస్టల్ బ్యాలెట్లతో కలిపి మొత్తం 14,01,721 ఓట్లు పోలవగా.. కాంగ్రెస్ అభ్యర్థికి 6,29,143 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్ 4,06,973 ఓట్లతో రెండో స్థానంలో, బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ 2,56,187 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. సీపీఎం అభ్యర్థి ఎమ్‌డీ జహంగీర్‌కు 28,730 ఓట్లు లభించాయి. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేసిన తొలిసారే భారీ మెజార్టీతో పార్లమెంట్‌లో అడుగు పెట్టనున్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 39 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా.. ఈ నలుగురికి మినహా మిగతా వారికి నామమాత్రం ఓట్లు లభించాయి. పోలైన ఓట్లలో కాంగ్రెస్‌కు 44.89 శాతం, బీజేపీకి 29.04, బీఆర్‌ఎస్‌కు 18.28, సీపీఎంకు 2.05శాతం ఓట్లు దక్కాయి. గెలుపు అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్ రెడ్డితో కలిసి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

ఇద్దరూ తొలిసారే..

నల్లగొండలో గెలిచిన కుందూరు రఘువీర్‌రెడ్డి, భువనగిరిలో విజయం సాధించిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇద్దరూ తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగారు. వీరిద్దరూ సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు కావడం విశేషం. వీరిద్దరికీ టికెట్లు ఇప్పించడంలో రేవంత్‌రెడ్డిది కీలక పాత్ర కాగా.. గెలుపు కోసం ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా పనిచేశారు. నల్లగొండలో రఘువీర్‌రెడ్డి కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కీలకంగా వ్యవహరించి హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోనే సుమారు రెండు లక్షల మెజార్టీని సాధించి పెట్టారు. మిగతా చోట్ల కూడా భారీ మెజార్టీలు దక్కాయి. దాంతో ఎవరూ ఊహించని విధంగా పోటీ చేసిన తొలిసారే ఇటు రఘువీర్‌రెడ్డి, అటు కిరణ్‌కుమార్‌రెడ్డి పార్లమెంట్‌లో అడుగు పెడుతున్నారు.

సజావుగా కౌంటింగ్

- ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగింపు
- పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా సాగిన ఈవీఎం, బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ ప్రక్రియను అక్కడే ఉండి పర్యవేక్షించిన కలెక్టర్ హరిచందన
- బ్యాలెట్ ఓట్ల కారణంగా అభ్యర్థికి ఆలస్యంగా అందజేసిన గెలుపు ధ్రువీకరణ పత్రం
- రఘువీర్‌కు మంత్రి కోమటిరెడ్డి, జానారెడ్డి, ఎమ్మెల్యేల అభినందనలు
- నల్లగొండ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందజేసేందుకు కృషి చేస్తానన్న రఘువీర్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 4 : నల్లగొండ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. నల్లగొండలోని అనిశెట్టి దుప్పలపల్లి ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగగా.. పోస్టల్ బ్యాలెట్ల కారణంగా మరో గంట ఆలస్యం అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలిచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ప్రకటించారు. ఈ ఎన్నిక గత నెల 13న నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ, నాగార్జున సాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాలతోపాటు సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో జరిగింది. దీనికి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం నిర్వహించగా.. ఆర్వో, నల్లగొండ కలెక్టర్ హరిచందన పర్యవేక్షణలో సజావుగా సాగింది. కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో కాంగ్రెస్‌కు ఆధిక్యత రావడంతో బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీతోపాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మధ్యలోనే వెళ్లిపోయారు. కౌంటింగ్ పూర్తయ్యాక రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యేలు బాలూనాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, బి.లక్ష్మారెడ్డి, ఉత్తమ్ పద్మావతితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటింగ్ కేంద్రానికి వచ్చారు. వారి సమక్షంలో రఘువీర్‌కు గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

పాలనపైనే దృష్టి పెడుతాం : మంత్రి కోమటిరెడ్డి

ఎన్నికలు పూర్తయినందున ఇక నుంచి పాలనపైనే పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆగస్టు 15 నాటికి రైతు రుణమాఫీ చేసి పెండింగ్ ప్రాజెక్టులు కట్టే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు ఎక్కువ మెజారిటీ కట్టబెట్టి మరింత బాధ్యత పెంచారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన చేస్తామని అన్నారు. అనంతరం కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజల అభిమానాన్ని మరువకుండా వారి సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతానని తెలిపారు.

పార్టీలు, అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లు

అభ్యర్థి	ఈవీఎం ఓట్లు	పోస్టల్ ఓట్లు	మొత్తం	ఓట్ల శాతం
రఘువీర్‌రెడ్డి (కాంగ్రెస్)	7,72,264	1,2073	7,84,337	60.5
సైదిరెడ్డి (బీజేపీ)	2,19,606	4,826	2,24,432	17.31
కంచర్ల కృష్ణారెడ్డి (బీఆర్‌ఎస్)	2,16,681	1,736	2,18,417	16.85
నందిపాటి జానయ్య (టీఎస్‌పీ)	10,832	27	10,859	0.84
బండారు నాగరాజు (స్వతంత్ర)	7,122	6	7,128	0.55
విరిగినేని అంజయ్య (బీఎస్‌పీ)	7,075	102	7,177	0.55
మారం వెంకట్‌రెడ్డి (స్వతంత్ర)	5,962	5	5,967	0.46
పానుగోతు లాల్‌సింగ్ (స్వతంత్ర)	5,277	9	5,286	0.41
తలారి రాంబాబు (డీఎస్‌పీ)	5,028	94	5,122	0.40
సుంకర రమేశ్ (స్వతంత్ర)	3,566	3	3,569	0.28
పొలిశెట్టి వెంకటేశ్వర్లు (స్వతంత్ర)	3,202	10	3,212	0.25
కుక్కల వెంకన్న (స్వతంత్ర)	2,561	5	2,566	0.20
చొల్లేటి ప్రభాకర్ (స్వతంత్ర)	2,482	22	2,504	0.19
గోలి సైదులు (స్వతంత్ర)	1,770	9	1,779	0.14
మర్రి నెహమయ్య (స్వతంత్ర)	1,653	9	1,662	0.13
పాలకూరి రవి (స్వతంత్ర)	1,545	2	1,547	0.12
వస్కుల మట్టయ్య (ఎంసీపీఐ)	1,033	7	1,040	0.08
కుందారపు శ్రీకాంత్ (స్వతంత్ర)	940	7	947	0.07
రచ్చ సుభద్రారెడ్డి (ఎస్‌పీ)	835	11	846	0.07
లింగం కృష్ణ (స్వతంత్ర)	666	0	666	0.05
కిన్నెర యాదయ్య (స్వతంత్ర)	654	7	661	0.05
సిరిశాల శ్రీనయ్య (స్వతంత్ర)	513	1	514	0.04
నోటా	5,869	217	6,086	0.47
మొత్తం	12,90,238	19,188	13,09,426	-

పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్‌కు

సర్వం సిద్ధం!

- నేడు ఉదయం 8గంటల నుంచి మొదలు
- తొలుత అన్ని బ్యాలెట్ పత్రాల కట్టల కార్యక్రమం
- మధ్యాహ్నం నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- ఒక్కో రౌండ్‌లో 96 వేల ఓట్ల లెక్కింపు
- నాలుగు రౌండ్లలో తేలనున్న తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్క
- చెల్లిన ఓట్లలోంచి గెలుపు కోటా నిర్ధారణ
- ఫలితం తేలకుంటే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- 36 గంటలకు పైగానే కౌంటింగ్ సమయం
- కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్
- పకడ్బందీగా లెక్కింపు, ఏర్పాట్లు పూర్తి : ఆర్‌ఓ హరిచందన

నల్లగొండ ప్రతినిధి, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. నల్లగొండ పట్టణ శివారులోని ఎ.దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములలో లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు కోసం నాలుగు కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేశారు. ఒక్కో హాల్‌లో 24 టేబుళ్లపై లెక్కింపు కొనసాగుతుంది. ముందుగా బ్యాలెట్ పత్రాలను కట్టలుగా కట్టే కార్యక్రమాన్ని చేపడుతారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇదే కొనసాగవచ్చని అంచనా. అనంతరం ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. ఒక్కో రౌండ్‌లో 96వేల ఓట్ల చొప్పున ప్రథమ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఇలా మొత్తం నాలుగు రౌండ్లలో పోలైన 3,36,005 ఓట్లను లెక్కించనున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితోపాటు మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా.. కౌంటింగ్‌కు అధికారులు పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక ఓట్ల లెక్కింపు ప్రాంతంలో 144 సెక్షన్ ఏర్పాటు చేస్తూ మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. పూర్తిగా సీసీ టీవీల పర్యవేక్షణలో నిఘా కొనసాగనుంది. మరోవైపు నేటి కౌంటింగ్ కోసం మంగళవారం సాయంత్రం నుంచే జిల్లా కేంద్రంలో సందడి మొదలైంది. అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లు, వారి కార్యకర్తలు, అభిమానుల రాకతో హోటళ్లు, లాడ్జీలన్నీ కిక్కిరిసిపోయాయి.

ముందుగా బండిల్స్ ప్రక్రియ

నాలుగు కౌంటింగ్ హాళ్లలో ఒక్కో హాల్‌లో 24 టేబుళ్ల చొప్పున మొత్తం 96 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. వీటిపై ముందుగా బ్యాలెట్ పత్రాలను కట్టలు కట్టే కార్యక్రమం చేపడుతారు. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో నిలువగా.. 605 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చిన బ్యాలెట్ బాక్సులను వరుస క్రమంలో టేబుల్‌కు ఒకటి ఇచ్చి ఓపెన్ చేస్తారు. బ్యాలెట్ బాక్సుల్లోని బ్యాలెట్ పేపర్లను టేబుల్‌పై కుప్పగా పోసి 25 పేపర్లను ఒక కట్టగా చేసి బండిల్స్ చేస్తారు. పోస్టల్ బ్యాలెట్లను కూడా ఇదే సమయంలో వీటితో కలిపేస్తారు. ఎప్పటికప్పుడు వీటన్నింటినీ తీసుకెళ్లి ఓ పెద్ద డ్రమ్ములో వేస్తారు. బండిల్ కార్యక్రమం పూర్తయ్యాక లెక్కింపు మొదలు కానుంది. అయితే.. బండిల్ కట్టేందుకే కనీసం ఐదు నుంచి ఆరు గంటల సమయం పట్టొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇది కొనసాగుతుండవచ్చని అంచనా. ఆ తర్వాతే అసలు ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. తొలి ప్రాధాన్యత ఓట్లను ముందుగా లెక్కిస్తారు. లెక్కింపునకు రెండు రోజుల సమయం పట్టవచ్చని భావిస్తున్న అధికారులు షిఫ్టులుగా సిబ్బందిని నియామకం చేశారు. సమయంతో సంబంధం లేకుండా ఒక్కో ప్రక్రియ ముగిసే వరకు ఒక షిఫ్ట్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిసింది. ఇక ఇదేవిధంగా కౌంటింగ్ ఏజెంట్లకు కూడా షిఫ్ట్‌ల వారీగా పాస్‌లు జారీ చేశారు.

సాయంత్రానికి తొలి ఫలితం..

బ్యాలెట్ పేపర్లన్నింటినీ 25 చొప్పున కట్టలు కట్టడం పూర్తి చేశాక తొలి ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌కు 40 కట్టల చొప్పున మొత్తం వెయ్యి ఓట్లను ఒక రౌండ్‌లో ఇస్తారు. ఇలా ఒకేసారి 96 టేబుళ్లపై 96వేల ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. ఇలా చేపట్టే తొలి రౌండ్ ఫలితం నేటి సాయంత్రం 5గంటల వరకు వెలువడవచ్చని అంచనా. బండిల్స్ కార్యక్రమం మధ్యాహ్నం రెండు గంటలకు ముగిస్తే గంట విరామం అనంతరం మూడు గంటలకు తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలైతే గంటన్నర నుంచి రెండు గంటల్లో తొలి రౌండ్ ఫలితం వెలువడవచ్చని అంచనా. ఇలా అనుకున్నది అనుకున్నట్లు జరిగితే అర్ధరాత్రి 12గంటల వరకు తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి కావచ్చని భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,36,005 ఓట్లు పోలైన విషయం తెలిసిందే. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సమయంలోనే చెల్లని ఓట్లను వేరు చేస్తారు. ఆ తర్వాత చెల్లిన ఓట్ల నుంచే గెలుపు కోటాను నిర్ధారిస్తారు. చెల్లిన ఓట్లలో 50శాతం+1ను గెలుపు కోటా కానుంది. తొలి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికీ గెలుపు కోటా రాకపోతే అప్పుడు ఎలిమినేషన్ ప్రక్రియ మొదలవుతుంది. ఇదే జరిగితే తర్వాత కూడా కౌంటింగ్ కొనసాగనుంది.

ఎలిమినేషన్‌కు మరింత సమయం

తొలి ప్రాధాన్యత ఓట్లు పూర్తయ్యే సరికి అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లపై, అదేవిధంగా గెలుపు కోటాపై స్పష్టత వస్తుంది. అప్పటికీ ఎవరూ గెలుపు కోటా ఓట్లు సాధించలేకపోతే ఎలిమినేషన్ ప్రక్రియను మొదలు పెడుతారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ఎలిమినేషన్ రౌండ్‌ను ప్రారంభిస్తారు. ఆయనకు బ్యాలెట్‌లో పడిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను ఆయా అభ్యర్థుల వారీగా పంచుతూ వస్తారు. ఇలా ఒక్కో అభ్యర్థిని కింది నుంచి పైకి ఎలిమినేట్ చేస్తూ కౌంటింగ్ కొనసాగిస్తారు. ఈ క్రమంలో ఏ అభ్యర్థికైనా గెలుపు కోటా ఓట్లు వస్తే అక్కడితో కౌంటింగ్‌ను నిలిపివేసి విజేతను ప్రకటిస్తారు. అయితే.. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉండడంతో ఎలిమినేషన్ ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగే అవకాశం ఉంది. కిందటిసారి ఎలిమినేషన్ రౌండ్‌కే 44 గంటల సమయం పట్టింది. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ విజేత తేలకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను కూడా లెక్కించనున్నారు. కానీ.. ఇంతవరకు తృతీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు జరిగిన దాఖలాలు లేవనే చెప్పవచ్చు.

పకడ్బందీగా ఏర్పాట్లు

రెండు రోజుల పాటు జరుగనున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ హాల్ వెలుపుల, లోపల కలిపి మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కిలోమీటర్ పరిధిలో 144సెక్షన్ విధించారు. కేశరాజుపల్లి శివారులోనే పాస్‌లు ఉంటేనే లోపలికి అనుమతించేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే కౌంటింగ్ టేబుళ్లు, వాటికి అనుకుని బ్యాలెట్ పత్రాలను వేసేందుకు అభ్యర్థుల వారీగా ప్రత్యేక ర్యాక్‌లు, ఈ టేబుళ్లకు ఎదురుగా ఇనుప జాలీ ఏర్పాటు చేసి మరోవైపు కౌంటింగ్ ఏజెంట్లు కూర్చునేలా కుర్చీలు వేశారు. అభ్యర్థుల వారీగా బ్యాలెట్ పేపర్లను వేసేందుకు ప్రత్యేకంగా డ్రమ్ములను ఏర్పాటు చేశారు.

కౌంటింగ్ ప్రక్రియ ఇలా..

- ఓట్ల లెక్కింపు సిబ్బంది బుధవారం ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్ట్ చేయాలి. కౌంటింగ్ ఏజెంట్లు కూడా రావాలి.
- మొదటి బ్యాచ్ మొదటి షిఫ్ట్ ఉద్యోగులు ఉదయం 6నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విధుల్లో ఉంటారు.
- ఉదయం 8గంటలకు ప్రారంభం కాగానే ముందుగా బ్యాలెట్ పేపర్లను 25 బండిల్స్‌గా కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ సూపర్‌వైజర్ చేస్తారు.
- 25కి బండిల్స్ కాకుండా తక్కువగా మిగిలిపోయిన బ్యాలెట్ పేపర్లను తక్కువ ఉన్న బండిల్స్‌గా ఒక స్లిప్‌పై రాసి పెడుతారు.
- 25 చొప్పున చేసిన బండిల్స్‌ను ఒక ట్రంక్ బాక్సులో ఏఆర్‌ఓ టేబుల్‌పై ఉంచుతారు.
- 25కన్నా తక్కువ ఉన్న బండిల్స్‌ను ప్రత్యేకంగా మరో డ్రమ్ములో వేస్తారు. వీటిని తర్వాత 25 చొప్పున బండిల్స్ చేస్తారు.
- బండిల్ చేసిన అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు రెండో షిఫ్ట్ కౌంటింగ్ స్టాఫ్ విధుల్లోకి వస్తారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలు పెడుతారు. అర్ధరాత్రి తర్వాత ఒంటి గంట వరకు ఈ లెక్కింపు పూర్తి కావచ్చని అంచనా.
- రెండో విడుత సిబ్బంది డ్యూటీ అర్ధరాత్రి ఒంటి గంటకు ముగియనుంది.
- ఒక్కో రౌండ్‌లో టేబుల్‌కు వెయ్యి చొప్పున 96వేల ఓట్ల లెక్కింపు జరుగుతుంది.
- ఈ లెక్కన మూడు ఫుల్ రౌండ్స్‌తో పాటు నాలుగో రౌండ్‌లో 62 టేబుళ్లపై లెక్కింపు పూర్తి కానుంది.
- ఇలా తొలి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపునకు 8గంటల సమయం పట్టవచ్చని అంచనా.
- చెల్లని ఓట్లు ప్రత్యేకంగా ఒక ట్రేలో ఉంచుతారు.
- తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక చెల్లిన ఓట్లలోంచి 50శాతం+1ని కలిపి గెలుపు కోటా నిర్ధారిస్తారు.
- గెలుపు కోటాకు అనుగుణంగా ఏ అభ్యర్థి అయినా ఓట్లు సాధిస్తే కౌంటింగ్ ఆపేసి విజేతగా ప్రకటిస్తారు.
- ఒకవేళ ఎవరికీ కోటా ప్రకారం ఓట్లు రాకుంటే ఎలిమినేషన్ ప్రక్రియలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు.
- ఒకవేళ ఇలా ఎలిమినేషన్ రౌండ్ అవసరం పడితే మూడో షిఫ్ట్ సిబ్బంది విధుల్లోకి వస్తారు. వీరు ఇది పూర్తయ్యే వరకు విధుల్లో ఉంటారు.
- 2021లో 90గంటల పాటు సుదీర్ఘ సమయం కౌంటింగ్ జరుగడంతో ఈ సారి అదనపు టేబుళ్లు ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం 36 గంటల్లోపే కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావచ్చని అంచనా.

పాతబస్తీలో ఇంటింటి సర్వే

- ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న వైద్యారోగ్యశాఖ
- వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసిన మున్సిపల్ అధికారులు
- ట్యాంకర్ల ద్వారా వార్డు ప్రజలకు నీటి సరఫరా

నల్లగొండ పాతబస్తీలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ సిబ్బంది

నీలగిరి, జూన్ 4 : నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ ప్రాంతంలో వాటర్‌ట్యాంక్‌లో వ్యక్తి మృతదేహం లభించడం, ఆ నీరే ప్రజలకు సరఫరా కావడంతో వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఆశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాములబండ పీహెచ్‌సీ, లైన్‌వాడ యూహెచ్‌సీ సిబ్బంది నాలుగు వార్డుల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ జమీర్, సూపర్‌వైజర్లు కిరణ్‌కుమార్, పద్మ, 12 మంది ఆశ వర్కర్లు, 8 మంది ఏఎన్‌ఎంలు నాలుగు బృందాలుగా ఏర్పడి సుమారు వెయ్యి ఇండ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి, జ్వరం వంటి సమస్యలతో ఎవరైనా బాధపడుతున్నారా అనే కోణంలో సర్వే నిర్వహించారు. అక్కడక్కడ కొద్దిమంది సాధారణ జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించిన సిబ్బంది అందుకుగల కారణాలను తెలుసుకునేందుకు రక్త పరీక్షలు చేశారు. వారికి నీటి కాలుష్యంతో కాకుండా సాధారణ జ్వరాలుగానే గుర్తించారు. నాలుగు వార్డుల పరిధిలో ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ధనలక్ష్మి, నాగమణి, భాగ్యలక్ష్మి, పలువురు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

మున్సిపాలిటీ అధికారులు మంగళవారం వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశారు. ట్యాంక్‌లో క్లోరినేషన్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వారి ఇండ్లల్లో ఉన్న నీటిని ఖాళీ చేయించి ట్యాంకర్ల ద్వారా శుభ్రమైన నీటిని సరఫరా చేశారు. బుధవారం సాయంత్రం లేదా గురువారం ఉదయం నుంచి తిరిగి ట్యాంక్ ద్వారా ఆయా వార్డుల పరిధిలో నీటి సరఫరా పునరుద్ధరిస్తామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు.

బంగారం దుకాణంలో ఐటీ తనిఖీలు

బంగారు దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఐటీ అధికారులు

మిర్యాలగూడ, జూన్ 4 : పట్టణంలోని పెద్ద బజార్‌లో గల శ్రీదేవి ట్రేడర్స్ బంగారం దుకాణంలో మంగళవారం ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గత వారం ఏపీలోని పొట్టి శ్రీరాములు జిల్లా కావలి టోల్‌గేట్ వద్ద ఆర్టీసీ బస్సులో ఐదుగురు మహిళలు తరలిస్తున్న రూ.1.61కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచలం టోల్‌గేట్ వద్ద 1.658 కిలోల బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగింది. దీంతోపాటు ప్రకాశం జిల్లా టంగుటూరు వద్ద కారులో దంపతులు తరలిస్తున్న రూ.90లక్షల విలువైన బంగారాన్ని పోలీసులు పట్టుకొని ఐటీ అధికారులకు అప్పగించారు. పెద్ద మొత్తంలో నగదు, బంగారం పట్టుబడగా.. ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం మిర్యాలగూడలోని శ్రీదేవి ట్రేడర్స్ దుకాణానికి వచ్చి రికార్డులు పరిశీలించారు.

3గంటలకు పైగా వివరాలను సేకరించిన ఐటీ అధికారులు మీడియాకు ఎలాంటి వివరాలు వెల్లడించకుండానే వెళ్లిపోయారు. ఐటీ దాడుల నేపథ్యంలో మిర్యాలగూడలోని బంగారం దుకాణాల యజమానులు తమ షాపులను మూసివేశారు. ఐటీ తనిఖీలు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి.

రావి నారాయణరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

భూమిపూజలో పాల్గొన్న రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సభ్యులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 4 : మాజీ ఎంపీ, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని బొల్లేపల్లిలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జూలై చివరి నాటికి కాంస్య విగ్రహ ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. విగ్రహ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా మంత్రితో పాటు ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు. అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహా నాయకుడు రావి నారాయణరెడ్డి అని, ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ కార్యదర్శి రావి సుఖేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్‌రావు, సంయుక్త కార్యదర్శి రావి హేమంత్‌రెడ్డి, కోశాధికారి తిరుమణిదాసు వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారు భువనగిరి సత్యనారాయణ, సలహాదారు రావి ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు గడ్డం విజయ్‌భార్గవ్, కర్తోజు విజయ్‌కుమార్, సీలోజు రాజలింగం, సీలోజు లక్ష్మణాచారి, మాజీ సర్పంచ్ మద్ది బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ గడ్డమీద చంద్రకళావీరస్వామి, మాజీ జడ్పీటీసీ సందెల సుధాకర్ పాల్గొన్నారు.